## క్లుప్తంగా

### 12 బోర్ల తవ్వకానికి నిధులు



జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న ప్రిస్కిల్లా

పెళ్లకూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో 12 బోరు బావులు తవ్వకానికి జెడ్పీ నిధులు రూ.12 లక్షలు మంజూరు అయ్యాయని జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఒక్కొక్క బోరు బావి నిర్మాణానికి రూ.లక్ష నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. భీమవరం, అక్కగారిపేట, పునబాక, వడ్డిపాళెం, కానూరు, ముమ్మారెడ్డిగుంట, కృష్ణప్ప కండ్రిగ, పెళ్లకూరు, పెరుమాళ్లపల్లె, చవటకండ్రిగ, రావులపాడు గ్రామాల్లో బోరు బావులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా ఇందుకు సంబంధించిన ధ్రువపత్రం అందుకున్నామని చెప్పారు.

### మనవాళమ్మకు ప్రత్యేక పూజలు

ఓజిలి: మండలంలోని మనవాలి గ్రామదేవత శ్రీమనవాళమ్మవారికి గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వేదపండితులు ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారికి ముత్తంగిసేవ, దీపారాధన నిర్వహించారు. రాత్రి సాయినృత్య బృందం ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన చేశారు.

### ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

చిల్లకూరు: విద్యార్థి దశలోనే ఉన్నతస్థాయికి చేరుకోవాలన్న లక్ష్యాలను ఎన్నుకుని ముందుకు సాగితే ఫలితం దానంతటదే దగ్గరికి వచ్చి చేరుతుందని ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని తూర్పుకనుపూరు పంచాయతీలో ఉన్న పాఠశాలలో శనివారం విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఆర్డీఓ కిరణ్‌కుమార్‌ను జ్ఞాపిక అందజేసి, శాలువ కప్పి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్యామ్, సీనియర్ మేనేజర్ సీ హర్షవర్ధన్‌రెడ్డి, అడ్మిన్ మేనేజర్ సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చండికాపరమేశ్వరికి అభిషేక పూజలు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెంలో ఉన్న చండికాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉభయకర్తలు కే సురేష్‌రెడ్డి, వీ గురుదశరథన్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు హోమం చేసి, అమ్మవారికి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రాజమాతాదేవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఐ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురికి కాలువలు తదితర చోట్ల ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట అయిల్ బాల్స్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీ కాలువల్లో పడవేయకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు.

### కాంగ్రెస్ నేతల నిరసన

నాయుడుపేటటౌన్: నిత్యావసర సరుకులపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ రద్దు చేయాలని కోరుతూ శనివారం నాయుడుపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన ర్యాలీ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ సారథ్యంలో నిరసన తెలిపారు. పీసీసీ డెలిగేట్ తీగల భాస్కర్, నాయకులు మల్లికార్జున, గాడి వెంకటయ్య, తిలక్, షేక్ బాషా, సీ శివ, గోపాల్, రాఘవ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న ఎస్వీఆర్ ట్రస్టు సిబ్బంది

వెంకటగిరి: ఓ మహిళ మృతదేహానికి అంత్యక్రియల కోసం దాత ఆర్థిక సాయం చేశారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన చేనేత కళాకారిణి బీ సుబ్బలక్ష్మమ్మ ఆరోగ్యం క్షీణించి, శనివారం మృతి చెందింది. ఎస్వీఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు ఈ విషయం తెలుసుకున్నారు. దీంతో ఆయన తన ట్రస్టు ఆధ్వర్యంలో సుబ్బలక్ష్మమ్మ అంత్యక్రియలకు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గోపాలకృష్ణ, ఎం మునెయ్య, జీ కిరణ్, కే యానాది, ఏ భాను, ఓబయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

### చిల్లకూరులో రొట్టెల పండుగ రేపు

చిల్లకూరు: మండల కేంద్రంలోని దో షాహీద్ దర్గాలో సోమవారం రొట్టెల పండుగను నిర్వహించనున్నట్లు దర్గా ముతవల్లి జుబేద్ తెలిపారు. రొట్టెల పండుగను పురస్కరించుకుని నెల్లూరుకు వెళ్లిన ప్రతి భక్తుడు ఇక్కడ దర్గాలో సమాధులను దర్శించుకుని కోర్కెలను తీర్చుకుంటారని చెప్పారు.

---



• మస్తానయ్యది సూళ్లూరుపేట మండలం దామరాయి గ్రామం. ఈయనకు ఐదు ఎకరాల వరకు పొలం ఉంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామానికి చెందిన ఐదుగురు రైతులతో కలిసి(సీహెచ్‌సీ) కస్టమ్ హైరింగ్ గ్రూపుగా ఏర్పడ్డారు. ఆర్బీకే ద్వారా రాయితీపై రూ.15 లక్షలు విలువ చేసే ట్రాక్టర్, రోటావేటర్‌తో సహా వివిధ రకాలైన పరికరాలు తీసుకున్నారు. దీంతో ఆయన సేద్యం పనులు సులువు చేసుకుంటున్నాడు. ఇతర రైతులకు వ్యవసాయ పనిముట్లను అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నాడు.



• సూళ్లూరుపేట మండలం గోపాల్‌రెడ్డిపాళెం గ్రామానికి చెందిన బీ వెంకటరమణారెడ్డి రైతు. ఈయనకు సుమారు ఆరు ఎకరాలు పొలం ఉంది. టీడీపీ పాలనలో విత్తనాలు, ఎరువుల కోసం ఇక్కట్లు పడేవారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే పరిహారం అందేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వమే పంట బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించడంతో సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ వస్తోంది. అలాగే స్ప్రేయర్ల కోసం గతంలో చాలాసార్లు దరఖాస్తు చేసినా అందలేదు. ప్రస్తుతం దరఖాస్తు చేసిన వెంటనే వచ్చాయి. దీంతో ఆయనకు పురుగు మందుల పిచికారీ సులువు అయ్యింది.

# రైతు నేస్తం

దుక్కి దున్ని..ఆరుగాలం శ్రమిస్తేనే రైతు కడుపు చల్లారుతుంది. ఆ రైతు వేసే ప్రతి గింజ మొలకెత్తి.. పది మందికి పట్టెడన్నం పెడుతోంది. అందుకు కృషి చేసే కర్షకులకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తూ.. వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి పల్లె వాకిటకు వ్యవసాయ సేవలను తీసుకొచ్చింది. విత్తు నుంచి పంట చేతికొచ్చే వరకు కేంద్రాల ద్వారా సహాయ సహకారాలు అందిస్తోంది.

- ఆర్బీకేల ద్వారా పల్లె వాకిటకు సేవలు
- అన్ని దశల్లోనూ అన్నదాతకు చేయూత
- విత్తనం నుంచి విక్రయం వరకు అండ
- సాంకేతికత బదలాయింపులో కీలక పాత్ర





కేసీఎన్ గుంటలోని రైతు భరోసా కేంద్రం

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని రూరల్‌లో 8 సచివాలయాలు, మున్సిపాలిటీలోని 11 సచివాలయాల పరిధిలో 10 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 10,050 మంది రైతులు ఉన్నారు. రబీలో 5,500 హెక్టార్లు, ఖరీఫ్‌లో 1,160 హెక్టార్ల వరి సాగు చేస్తుంటారు. వీరికి ఆర్బీకేల ద్వారా నిత్యం రైతులకు సేవలు అందుతున్నాయి. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం పట్టణాలకు పరుగులు తీయాల్సివచ్చేది. శ్రమకోర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టింది. ప్రతి పంచాయతీలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు మొదలు ఎరువుల వ్యవసాయ పనిముట్లుతో పాటు అనేక సేవలు రైతుల ముంగిటకే చేరవేస్తోంది. గతంలో మండల కేంద్రాలకు పరిమితమైన వ్యవసాయ, ఉద్యాన, పశువర్ధక శాఖలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్బీకే ద్వారా గ్రామస్థాయికి విస్తరింపజేసింది.

| మండలం: సూళ్లూరుపేట | |
|---|---|
| రైతుభరోసా కేంద్రాలు | 10 |
| ఆర్బీకే పరిధిలో గ్రామాల సంఖ్య | 43 |
| సేవలు పొందుతున్న రైతులు | 10,050 |
| పంపిణీ చేసిన ఎరువులు | 1,420 మెట్రిక్ టన్నులు |
| విత్తనాలు | 1,250 క్వింటాళ్లు |
| రైతు సహాయక గ్రూపుల సంఖ్య | 37 |
| సభ్యుల సంఖ్య | 185 |
| పంపిణీ చేసిన ట్రాక్టర్లు | 15 |
| వ్యవసాయ పరికరాలు | 157 |

#### ఇంటి ముంగిటే ఎరువులు



గతంలో ఎరువులు, విత్తనాల కోసం పట్టణాలకు వెళ్లి ఇబ్బందులు పడేవారం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆర్బీకే సెంటర్ల పుణ్యమా అని ఇంటి ముంగిటకే ఎరువులు వచ్చి చేరుతున్నాయి. పథకాలు గురించి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. రైతులకు ఆర్బీకేలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. – మల్లికార్జున్‌రెడ్డి మంగళంపాడు

#### రైతులకు అండ



రైతు భరోసా కేంద్రాలు మా లాంటి చిన్న రైతులకు ఎంతో అండగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులకు అందజేస్తున్న సేవలు ఎంతో బాగున్నాయి. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు మా గ్రామానికే వచ్చి, సలహాలు, సూచనలు ఇస్తున్నారు. దీంతో ప్రశాంతంగా వ్యవసాయం చేసుకుంటున్నాం. –డి. మాధమయ్య, ఇలుపూరు

#### రైతుల కోసమే ఆర్బీకేలు



ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు రైతులకు అందుబాటులో ఉన్నారు. సాగు కావాల్సిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రాలు ఆర్బీకే కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ప్రతి రైతుకూ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. – కవిత, వ్యవసాయాధికారి, సూళ్లూరుపేట

### జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రవీంద్రారెడ్డి

రాపూరు: జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి చేకూరుతుందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి అన్నారు. రాపూరు మండలం గోనుపల్లెలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ డీ నారాయణరెడ్డి, సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీడీఓ అప్పాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు శివకుమార్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు అధిక ప్రాధాన్యం



నాయుడుకాలువలో పూడికతీత పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో పలు సంస్కరణలు తీసుకొచ్చి, విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల దాతృత్వంతో రూ.10 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన కళాశాల వసతి గృహ భవనాలను శనివారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని భావించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు.

**సొంత నిధులతో పంట కాలువల్లో పూడికత**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గూడూరు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముందు చూపుతో మురుగునీరు, చెత్తాచెదారాలతో నిండిన పంట కాలువల్లో పూడికతీత పనులను శనివారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండో పట్టణంలోని వీరారెడ్డిపల్లెలో ఉన్న నాయుడుకాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదనీరు ఇళ్లల్లోకి రాకుండా ఉండేలా పంట కాలువను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కే మీరారెడ్డి, బీ విజయకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ కే గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ డీ కృష్ణారెడ్డి, వేణురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీహరి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నరసయ్య, కళాశాల ప్రిన్సిపల్ రవికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

**వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కృషి..**

గూడూరురూరల్: వైఎస్సార్ సీపీ అనుబంధ కార్మిక విభాగమైన వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరులోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ట్రేడ్ యూనియన్ ఏర్పాటుపై చర్చించేందుకు ఆ యూనియన్ జోనల్, జిల్లా నాయకులు సమావేశం నిర్వహించారు. ఆ కమిటీ నేతలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు శాలువ కప్పి సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీకి ట్రేడ్ యూనియన్ చాలా ముఖ్యమన్నారు. కార్మికులు చైతన్యవంతులైతే రాజకీయాలను శాసిస్తారని తెలిపారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. వైఎస్సార్‌టీయూ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అమ్మిటి ఉపేంద్ర మాట్లాడుతూ కార్మికులు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీయూ రాష్ట్ర కార్యదర్శి కుమార్ పాల్, రాష్ట్ర నాయకులు ఎం రాజేష్‌కుమార్, జిల్లా నాయకులు షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

### కారుఢీకొని వ్యక్తికి గాయాలు

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిలోని అక్కగారిపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. చవటకండ్రిగ గ్రామానికి చెందిన పసల వెంకయ్య పొలం పనులు ముగించుకుని స్వగ్రామం వెళ్లేందుకు అక్కగారిపేట వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే కారు అతి వేగంగా వచ్చి ఢీకొని, వెళ్లిపోయింది. ఈ ఘటనలో గాయపడిన వెంకయ్యను స్థానికులు గుర్తించి, చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

### కానిస్టేబుల్ కుమారుడికి ఎస్పీ అభినందన



హిమతేజాను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి

చిల్లకూరు: అండర్ –20 ఆసియా అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుమారుడు హిమతేజాను శనివారం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. కోట మండలం ఊనుగుంటపాళెనికి చెందిన వెంకటేశ్వర్లు చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఆయన కుమారుడు హిమతేజ విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇతడు భారతదేశం తరుపున జూన్ 4 నుంచి 7వ తేదీ వరకు సౌత్ కొరియాలో జరిగిన ఆసియా అండర్–20 రిలే పరుగు పందెంలో పాల్గొన్నాడు. ఈ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఈ క్రమంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి విద్యార్థి హిమతేజాను తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావ్, విమలకుమారి, మునిరామయ్య, ఎస్ఈబీ రాజేంద్ర, పోలీస్ సంఘం అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టిప్పర్ బోల్తా



సైదాపురం: ఖనిజాన్ని అధిక టన్నేజీతో తరలిస్తున్న టిప్పర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన సైదాపురం–ఊటుకూరు మార్గంలోని ఓ యార్డు వద్ద శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఏఎస్ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. అధిక టన్నేజీ కారణంగానే టిప్పర్ బోల్తా పడినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏడీ వరప్రసాద్‌రెడ్డి

వాకాడు: తీరప్రాంత గ్రామాల్లోని విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ట్రాన్స్‌కో ఏడీ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తీర గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై శనివారం నిడిగుర్తి సచివాలయంలో విద్యుత్ అధికారులు, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా తీర ప్రాంతంలోని నాలుగు పంచాయతీల్లో విద్యుత్ లైన్లు మరమ్మతు చేయాల్సి ఉందన్నారు. ఈ సమస్యను పూర్తి స్థాయిలో పరిశీలించి, పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కే దామోదర్‌రెడ్డి, డీ అజిత్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపద వేళ ఆపన్నహస్తం అందిస్తూ..

వలంటీర్లకు వందనం





ఆస్పత్రికి తీసుకెళుతున్న గౌసున్నీకు పింఛన్ అందించి, అంబులెన్స్ వద్ద ఉన్న వలంటీర్ మణెమ్మ(ఫైల్)

నాయుడుపేటటౌన్: కోవిడ్ సమయంలో నా అన్న వారు సైతం ఎవరు ముందుకు రాని కష్టకాలంలో నేను ఉన్నానంటూ ముందుకు వచ్చి ఆపన్నహస్తం అందించారు వలంటీర్లు. తమ పరిధిలోని కుటుంబాల వారిని అప్యాయతగా పలకరిస్తూ సేవలందించారు. ఈ కోవలో సేవలందించిన నాయుడుపేట పట్టణం గరిడీవీధి వలంటీర్ చీరాల మణెమ్మను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. పట్టణంలోని గరిడీవీధికి చెందిన గౌసున్నీ అనే వితంతువుకు కోవిడ్ సోకి, ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గౌసున్నీకు మెరుగైన వైద్యం అందించడానికి నెల్లూరు నుంచి తిరుపతికి తరలిస్తున్నట్లు తెలుసుకున్న వలంటీర్ మణెమ్మ సచివాలయ అడ్మిన్ అక్తర్, వెల్ఫేర్ అసిస్టెంట్ బల్లి సురేంద్రకు విషయం చెప్పి, గౌసున్నీ పింఛన్‌ను నెల్లూరు నుంచి తిరుపతికి తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలోని నాయుడుపేట వద్ద రహదారిపై అంబులెన్స్ ఆపి పంపిణీ చేసి, మానవత్వాన్ని చాటుకుంది. అంతే కాదు ఆమె తన పరిధిలోని 60 కుటుంబాల వారికి కోవిడ్ సమయంలో అన్ని విధాలా అండగా నిలిచింది.

#### అక్కున చేర్చుకుంటుంది



మా వలంటీర్ మణెమ్మ అప్తురాలిలా మెలుగుతూ ఏదైనా సమస్య వస్తే అక్కున చేర్చుకుని ఆదుకుంటుంది. కోవిడ్ సమయంలో ఒకరికొకరు దగ్గరకు వచ్చేందుకు భయపడుతున్న సమయంలో ఆమె ముందుకు వచ్చి ఎంతో ధైర్యం చెబుతుండేది. అంతేకాదు నా ఆరోగ్యపరిస్థితి విషమించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నాకు సాయం చేసింది. అంతేకాదు ఆపద వేళలో ఆమె అధికారులతో మాట్లాడి, అంబులెన్స్‌లో వెళుతున్న నాకు పింఛన్ సైతం అందించి, ఆదుకుంది. వలంటీర్ మణెమ్మతోపాటు ఆ వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాను. – షేక్ గౌసున్నీ, గరిడీవీధి, నాయుడు పేట

## రాష్ట్రంలో సంక్షేమ పాలన



లబ్ధిదారుకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఓజిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కురుగొండలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు కలసికట్టుగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏ దిలీప్‌కుమార్‌రెడ్డి, ఐటీ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ శ్రీనివాసులురెడ్డి, నాయకులు జీ వేణురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కోటిరెడ్డి, జిల్లా కార్యదర్శులు డీ మధుసూదన్‌రెడ్డి, పీ హరనాథ్‌రెడ్డి, ఎం సుబ్బారావుయాదవ్, యాహరనాథ్‌రెడ్డి, కే ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ సీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ**

కురుగొండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎం ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శనివారం పరామర్శించారు. కొద్దిరోజులుగా ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఎమ్మెల్యే ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు అడిగితెలుసుకున్నారు.

## ఘనంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ



పల్లకిలో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామివారికి శనివారం పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున సుప్రభాత సేవ జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఉడతా వెంకటేశ్వర్లు, విజయమ్మ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కందల ఆనంద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## కల్యాణం కమనీయం



స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటకు పూలంగిసేవ నిర్వహించారు. తరువాత 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నిత్యకల్యాణ మండలపంలో కొలువు దీర్చి, వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊజంల్ సేవ నిర్వహించారు.

## భక్తి శ్రద్ధలతో మొహర్రం



నాయుడుపేటటౌన్: గరిడీవీధిలో పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు



రాపూరులో పీర్ల ఊరేగింపు

నాయుడుపేటటౌన్: ముస్లింలు శనివారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని గరిడీవీధిలో ఉన్న హజరత్ మౌలాలీ తలీమ్ ఖానాలో ప్రతిష్ఠించిన పీర్ల వద్ద భక్తులు ఫాతెహాలు జరుపుకుని, ప్రసాదాలు పంచి పెట్టారు. పలువురు పంజాలను తీసుకువచ్చి పీర్ల వద్ద ప్రతిష్ఠించి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో పంజాలు ప్రతిష్ఠించిన ప్రాంతాల్లో ముస్లింలతో పాటు హిందువుల సైతం వచ్చి ప్రార్థనలు చేశారు. అలాగే పట్టణంలోని పీర్ల చావడి వద్ద కూడా భక్తులు ప్రార్థనలు చేశారు.

**రాపూరులో..**

రాపూరు: మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడకలను ముస్లిం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక పీర్ల చావడి వద్ద నిప్పుల గుండం ఏర్పాటు చేసి, తొక్కారు. అంతకు ముందు పీర్లను పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పీర్ల చావిడిలోని అబ్లీసాహెబ్, పగ్గాలు, తుడుం పీర్లను చావడిలోని పీర్లను వైభవంగా ఊరేగించారు.